క్లుప్తంగా

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ



మావుళ్లమ్మకు బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ వారికి పట్టణానికి చెందిన అనిల్ కుమార్ సాయి, ప్రవల్లిక దంపతులు 8 గ్రాముల బంగారం, అలాగే తెనాలికి చెందిన హేమంత్, కావ్యశ్రీ దంపతులు 10 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు మావుళ్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డీఎన్నార్ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



భీమవరం డీఎన్నార్ కళాశాలలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ కళాశాలలో డిగ్రీ 6వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను కళాశాల పాలకవర్గ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) విడుదల చేశారు. వీటిలో బీఏ, బీఎస్సీ, బీకాం (జనరల్), బీకాం (కంప్యూటర్స్), బీబీఏ, బీవోక్ కోర్సులలో విద్యార్థులు నూరు ఉత్తీర్ణత సాధించినట్లు బాబు తెలిపారు. అనంతరం కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా నేటి టెక్నాలజీకి అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.

కలెక్టర్‌కు సత్కారం



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్యలకు స్వీప్ యాక్టివిటీస్ ఆధ్వర్యంలో అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్తశుద్ధితో పని చేసి, వృత్తి ధర్మాన్ని పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అభినందనీయులని స్వీప్ యాక్టివిటీస్ బ్రాండ్ అంబాసిడర్ చెరుకువాడ రంగసాయి, లయన్స్ క్లబ్ నాయకులు కంతేటి వెంకటరాజు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో వారిని కలసి సత్కరించామన్నారు. గత 4 నెలలుగా ఎన్నికల అధికారులు, యంత్రాంగం చేసిన సేవలు అద్వితీయమన్నారు.

భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే రామాంజనేయులు

భీమవరం: నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గం అభివృద్ధి చేసేందుకు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేస్తానన్నారు. నియోజకవర్గంలోని భీమవరం పట్టణం, వీరవాసరం, భీమవరం మండలాల్లోని శివారు ప్రాంతాలకు తాగునీరు అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంతో పాటు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. తన విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు అంజిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

హక్కుల సాధనకు సంఘటితంగా పోరాడాలి

తణుకు: కొబ్బరి దింపు కార్మికులు తమ హక్కుల సాధనకు సంఘటిత పోరాటాలకు సమాయత్తం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. గురువారం తణుకు సురాజ్య భవన్‌లో తణుకు ఏరియా కొబ్బరి దింపు, ఒలుపు కార్మికుల సర్వసభ్య సమావేశం జరిగింది.సమావేశానికి భీమారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా సంఘాలు నిర్మించుకుని హక్కుల సాధనకు పూనుకోవాలన్నారు. కార్మిక పోరాటాలతోనే హక్కులు సిద్ధిస్తాయన్నారు. కొబ్బరి దింపు, ఒలుపు కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు సహకరించాలని, వారికి సామాజిక భద్రత కల్పించాలని భీమారావు డిమాండ్ చేశారు. తణుకు ఏరియా కొబ్బరి దింపు, ఒలుపు కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా కోనాల భీమారావు, అధ్యక్షుడిగా బొక్కా సత్యనారాయణ, కార్యదర్శిగా పెచ్చేటి శ్రీను, కోశాధికారిగా కౌరు శ్రీను, సభ్యులుగా కేతా సత్యనారాయణ, దొంగ దానయ్య ఎన్నికయ్యారు.

గ్రంథాలయాల్లో ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

భీమవరం: పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖాగ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్యాన్స్ మాస్టర్ జె.శ్యామ్ న్యాయ నిర్ణేతగా విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పుస్తక పఠనం, చెస్, క్యారమ్స్‌లలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పాఠకుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, వి.సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

గ్రంథాలయాల్లో విలువైన పుస్తకాలు చదవడం వలన విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరుగుతుందని ఉండి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వై.రామలక్ష్మి అన్నారు. ఉండిలో గ్రంథాలయ వేసవి శిక్షణ కార్యక్రమాల ముగింపును పురస్కరించుకుని విద్యార్థులకు గురువారం బహుమతి ప్రధానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకొని మంచి పరిజ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. నల్లా ఫౌండేషన్ చైర్మన్ నల్లా సత్యకిరణ్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు వైజ్ఞానిక విషయాలు నేర్చుకోవాలంటే గ్రంథాలయాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 21 రోజులపాటు వేసవి శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు పి.శ్యామలరావు, గ్రంథాలయాధికారి జేవీ.కృష్ణమూర్తి పాల్గొన్నారు.





భీమవరం వైఎస్సార్ శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణశిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, పాలకోడేరులో చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చదరంగం పోటీలు

పాలకోడేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం చదరంగంలో తుది పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు మండల విద్యాశాఖాధికారి చేతుల మీదుగా బహుమతి, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని గ్రంథాలయ పాలకుడు బాలరాజు తెలిపారు.



ఉండి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఎన్నికల విజయవంతం హర్షణీయం

● జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య

ఉండి : ఎన్నికల ప్రక్రియకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య పత్రికా ప్రకటనలో గురువారం తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో నోటిఫికేసన్ వెలువడిన నాటి నుంచి కౌంటింగ్ పూర్తి చేసే వరకు అధికారులంతా నిబద్ధతతో పని చేశారని, అధికారుల సమిష్టి కృషితో ఎలాంటి విఘాతం లేకుండా ప్రశాంతంగా నిర్వహించారన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి చేసిన సర్వే, పోలీస్ అధికారుల సేవలు అభినందనీయమన్నారు. తహసీల్దార్ కే.శ్రీనివాస్, ఎంపీడీవో ఎస్.రవీంద్ర ఎన్నికల ప్రక్రియలో ప్రధాన పాత్రపోషించారని తెలిపారు. నిష్పక్షపాతంగా నిర్వహించిన ఈ ఎన్నికలు అందరికీ మంచిపేరు తెచ్చాయని జేసీ తెలిపారు.

12న పాఠశాలలు పునఃప్రారంభం

ఆకివీడు: జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభిస్తామని మండల విద్యాశాఖ అధికారి ఏ.రవీంద్ర గురువారం తెలిపారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామాగ్రి పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. మండలంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే సుమారుల 4,500 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు, టైలు, షూలు సిద్ధంగా ఉన్నాయని ఎంఈవో తెలిపారు. నోట్ పుస్తకాలు, యూనీఫామ్‌లు రావలసి ఉందన్నారు.

మట్టి వ్యర్థాలతో ఉప్పుటేరు విలవిల

ఆకివీడు: కృష్ణా, పశ్చిమ తీర ప్రాంతాలకు మురుగు నీరు పారేందుకు ప్రధాన ఆధారంగా ఉన్న ఉప్పుటేరు వ్యర్థాలతో విలవిలలాడుతోంది. ఉప్పుటేరులో పూడికలు తొలగించి రెండు దశాబ్దాలు కావస్తోంది. వివిధ ప్రాంతాల్లో ఉప్పుటేరులో పూడికలు పేరుకుపోయి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. రైల్వే డబ్లింగ్ లైన్ నిర్మాణంలో రెండో వంతెన నిర్మాణ సమయంలో ఏర్పడిన మట్టి పూడికల తొలగింపు నేటికీ పూర్తి కాలేదు. ఇటీవల జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఉప్పుటేరుపై మరో వంతెన నిర్మిస్తున్నారు. నిర్మాణ సమయంలో అవసరమైన మట్టిని పూడ్చి, పిల్లర్ల కోసం తవ్విన మట్టిని ఉప్పుటేరులోనే వదిలేశారు. దీంతో పూడికలు మరింతగా పెరిగిపోతున్న తరుణంలో గ్రామాల్లోని వ్యర్థాలతో ఏర్పడిన మట్టిని తీసుకొచ్చి ఉప్పుటేరులో భారీగా వేశారు. ఉప్పుటేరు పూడికలపై డ్రెయినేజీ శాఖ ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడంతో పలుచోట్ల వ్యర్థాల్ని ఉప్పుటేరులో వదిలేస్తున్నారు. సుమారు 50 అడుగులకు పైగా లోతు, 400 మీటర్లకు పైగా వెడల్పు ఉన్న ఉప్పుటేరు పలుచోట్ల కుచించుకుపోతోంది. దీంతో ముంపునీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కలుగుతుంది. సహజసిద్ధంగా ఏర్పడిన ఉప్పుటేరు ఆక్రమణల్ని తొలగించి, వ్యర్థాలు పారబోసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డ్రెయినేజీ శాఖాధికారులను కోరుతున్నారు.



ఉప్పుటేరులోకి వ్యర్థాల మట్టిని వేస్తున్న దృశ్యం

పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు

భీమవరం: అణగారిన వర్గాల అభ్యున్నతి ఆర్థిక, సామాజిక అంతరాలు లేని సమసమాజ స్థాపనే లక్ష్యంగా కృషి చేసిన పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. గురువారం చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి సందర్భంగా భీమవరం శ్రీనివాస థియేటర్ సెంటర్లో సీపీఐ స్థూపం వద్ద చంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భీమారావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో, భూమి కోసం, భుక్తి కోసం, శ్రమజీవుల బానిసత్వ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో చంద్ర వీరోచిత పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో చంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

భీమవరం: భీమవరం పట్టణంలోని చినరంగని పాలెం రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణం నుంచి మోటార్ సైకిల్‌పై ఇద్దరు వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో మోటార్ సైకిల్ ఢీ కొనడంతో ముగ్గురికి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఇరువురు భీమవరం పట్టణానికి చెందిన వారు కాగా మరొకరు పాలకోడేరు మండలం పెన్నాడ అగ్రహారం గ్రామానికి చెందిన వ్యక్తిగా చెబుతున్నారు. ముగ్గురికి తలలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు, బంధువులు హుటాహుటిన భీమవరం ఆసుపత్రికి తరలించినట్లు చెబుతున్నారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది. దీనిపై వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావును వివరణ కోరగా ప్రమాద సమాచారం తెలియడంతో ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేస్తున్నట్టు తెలిపారు.



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

కొనసాగుతున్న శిక్షణ తరగతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహోన్నతుల జీవిత చరిత్రలు నేటి పిల్లలకు ఆదర్శనీయమని విశ్రాంత ఉద్యోగి గిరికపాటి బాపయ్యశర్మ అన్నారు. తాడేపల్లిగూడెం గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావుచే నిర్వహించారు. ప్రముఖుల జీవిత విశేషాలను తెలుసుకోవడం, వారి మార్గాలను అనుసరించడం నేటి తరం విద్యార్థులకు ఎంతో అవసరం అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా సలహాదారులు ప్రత్తి వీరాస్వామి, రిసోర్స్‌పర్సన్ ఎస్.సత్యంలు విద్యార్థులకు పలు ఆసక్తి కలిగించే విషయాలను వెల్లడించారు.

అధ్వానంగా ఏటిగట్టు లైటింగ్

నరసాపురం: నరసాపురం గోదావరి ఏటిగట్టు పొడవునా వీధి లైట్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడా సవ్యంగా లైట్లు వెలగడం లేదు. కొన్ని చోట్ల పోయిన లైట్లను మునిసిపల్ అధికారులు తిరిగి ఏర్పాటు చేయడంలేదు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వలందర రేవు, లలితాంబ ఘాట్ వద్ద, పడవల రేవు తప్పిస్తే ఏటిగట్టు పొడవునా మరెక్కడా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం సమయంలో వీధి దీపాలు సవ్యంగా వెలగకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

విజయ ల్యాబ్ అధినేత మురళికి సత్కారం

పాలకొల్లు అర్బన్ : ఇటీవల పాస్టర్లకు ఉచిత వైద్య సేవలందించిన విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణను పాలకొల్లు పట్టణ, మండల పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం సత్కరించారు. మండలంలోని ఉల్లంపర్రులో పాస్టర్ కరుణాకర్ చర్చి ఆవరణలో జరిగిన సమావేశంలో హెబ్రోన్ ఛారిటీస్ డైరెక్టర్ జల్లి సాగర్ ప్రకాశం అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అసోసియేషన్‌లోని పాస్టర్ల కుటుంబ సభ్యులకు గుండె, కిడ్నీ, లివర్, సుగర్, బీపీ తదితర పరీక్షలు విజయా ల్యాబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికిగానూ మురళీకృష్ణను శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహూకరించి కృతజ్ఞతలు తెలిపారు. పాస్టర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గోబేరు కృపా శ్యాంసన్, గౌరవాధ్యక్షుడు ఐ.సెయింట్‌పాల్, సనమండ ఎబినేజరు, రాపాక రత్నరాజు, బి.ఇశ్రాయేలు, ఎస్.కిషోర్, కె రాజు, పీటర్ తదితరులు పాల్గొన్నారు.



ఉల్లంపర్రులో విజయ ల్యాబ్ అధినేత మురళీకృష్ణను సత్కరిస్తున్న పాస్టర్ల సంఘ నాయకులు

జనసేన, కూటమి విజయోత్సవ సంబరాలు



సాయినగర్‌లో కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు

ఆకివీడు: స్థానిక ఎస్వీఆర్ యూత్, జనసేన, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం విజయోత్సవం నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పిఠాపురంలో తమ నాయకుడు పవన్ కళ్యాణ్, కూటమి అభ్యర్థులు విజయం సాధించినందుకు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా పట్టణ జనసేన అధ్యక్షుడు పిల్లా నర్సింహరావు (బాబులు), కౌన్సిలర్ గోపిశెట్టి సత్యవతి మాట్లాడుతూ కూటమి విజయానికి సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు గవర లక్ష్మి, భ్రమరాంబిక, మోటుపల్లి సుబ్బారావు, సత్తిరాజు, తోట వాసు, గంధం ఉమా, చందూరి సతీష్, మోటుపల్లి రాఘవేంద్రరావు, జీఎస్వీ సత్యనారాయణ, పెదకాపవరం నాయకులు జిమ్ అనిల్, పసుపులేటి వెంకటరమణ, సురేష్, బోనం సుబ్రహ్మణ్యం, శివరామకృష్ణ, ఆముజాల సత్యనారాయణ, పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన ఉండాలి



వైద్య శిబిరం వద్ద లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన తప్పనిసరి అని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. లయన్స్‌క్లబ్, కైండ్‌నెస్ సొసైటీ, ఉజ్వల లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణం బ్రహ్మకుమారీస్ కార్యాలయం సమీపంలో విజయవాడ మణిపాల్ ఆస్పత్రి నేత్రత్వంలో దాత పదం కుమార్ గుప్తా సౌజన్యంతో గురువారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం, మొబైల్ బస్సులో వివిధ రకాల పరికరాలతో ఉచిత కాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, మెమోగ్రాఫ్ టెస్టులు నిర్వహించారు. 154 మందికి వైద్య పరీక్షలు జరిగాయి. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి రమాదేవి, దాట్ల లక్ష్మీపతిరాజు, జోన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, మాదిరెడ్డి కృష్ణకుమారి, అవినాష్ రాజు, సత్యస్వరూప్, ఆర్వీఎస్ రాజు పాల్గొన్నారు.

'చంద్ర' ఆశయ సాధనకు కృషి చేయాలి

తణుకు: భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుల్లో ప్రముఖులు, భూపోరాట యోధులు చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సొసైటీ రోడ్డులోని మున్సిపల్ పార్కు వద్ద రాజేశ్వరరావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పాల్గొని మాట్లాడుతూ భూస్వామ్య వ్యవస్థతో దోపిడీ విధానంపై, మహిళల రక్షణకు, పార్టీ రక్షణకు పోరాడిన యోధుడు రాజేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, దారి దీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ, సీపీఐ నాయకులు టి.అప్పలస్వామి, బద్దాని నాగరాజు పాల్గొన్నారు.

'గూడెం'లో 29.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలో గడిచిన 24 గంటల్లో 29.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ మురళీకృష్ణ గురువారం తెలిపారు. పెంటపాడు మండలంలోని వివిధ గ్రామాలలో మొత్తం 33.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ, ఎల్‌టీ లైన్ వార్షిక మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

కూచంపూడికి పీవీఎల్ నివాళులు

కాళ్ల: జక్కరం మాజీ సర్పంచ్ కూచంపూడి లక్ష్మీపతిరాజు మృతికి పీవీఎల్ నరసింహరాజు సంతాపం తెలిపారు. జక్కరం మాజీ సర్పంచ్ కూచంపూడి లక్ష్మీపతి రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు గురువారం పీవీఎల్ నరసింహరాజు జక్కరంలో లక్ష్మీపతిరాజు నివాసం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. కూచంపూడి లక్ష్మీపతిరాజు మృతి కుటుంబంతోపాటు గ్రామానికి, పార్టీకి తీరని లోటని తెలిపారు. ఈయన వెంట పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, నంద్యాల రామరాజు, కందుల మల్లికార్జునరావు, తాణంకి నాగరాజు, తదితరులు ఉన్నారు.



జక్కరం మాజీ సర్పంచ్ కూచంపూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీవీఎల్ నరసింహరాజు

ప్రభాకర్ (ప్రభు) మా'స్టార్' ఇక లేరు

ఆకివీడు: మా ప్రభు మాస్టారు ఇకలేరు, మా ఉన్నత చదువుల కోసం ఆయన నిరంతరం శ్రమించేవారు. పేద విద్యార్థులమైన మాకు ఆయన ఎన్నో సేవలందించారు. రక్త దానంతో మా ప్రాణాల్ని కాపాడిన ప్రభు ఇకలేరన్న విషయాన్ని తట్టుకోలేకపోతున్నామంటూ తలసేమియా రోగులు, విద్యార్థులు, స్నేహితులు, సన్నిహితులు బోరున విలపించారు. మండలంలోని అజ్జమూరు గ్రామానికి చెందిన చందన ప్రభాకరరావు (52) మాస్టారు ప్రస్తుతం మండలంలోని కోళ్లపర్రులో ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయనకు పిల్లలు లేరు. గురువారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఉపాధ్యాయ వృతితో క్రమశిక్షణ గల పౌరుల్ని సమాజానికి అందించిన ప్రభు మాస్టారు ఆకస్మిక మరణం తీరని లోటని పలువురు పేర్కొంటున్నారు. శుక్రవారం ఉదయం ఆయన పార్థవ దేహాన్ని అజ్జమూరు గ్రామంలో ఖననం చేయనున్నారు.



చందన ప్రభాకర రావు

కాలువల ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలి

భీమవరం: మండలంలోని పంట, మురుగు కాలువల్లో కాలుష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు తోట గంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలసి కాలువల ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ తుందుర్రు, వెంపమీదుగా వెళ్లే అడవికోడు, ముత్యంకోడు పంట కాలువలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయన్నారు. దీనిపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు రైతుల పంట భూములను రక్షించాలని కోరినట్లు తెలిపారు. ఆక్వా రైతులకు ప్రత్యేక మురుగు పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ కాలువల కాలుష్యంపై సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి ప్రత్యేక ప్రణాళికతో కాలుష్య సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు గంగరాజు తెలిపారు.



భీమవరంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంగరాజు

రైతు సంఘ నాయకుడు వెంకటపతిరాజుకు నివాళి

భీమవరం: రైతు సంఘం నాయకుడిగా, సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడిగా కలిదిండి వెంకటపతి రాజు విశేషమైన సేవలందించారని ఆ పార్టీ జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు జేఎన్వీ గోపాలన్ అన్నారు. గురువారం వెంకటపతిరాజు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ పార్టీలో క్రమశిక్షణతో ప్రజల కోసం పని చేశారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంకటపతిరాజు ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లినప్పుడే ఆయనకు ఘనమైన నివాళులన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు ఎం.వై కుంతరావు, డి.త్రిమూర్తులు, గొడుగు వెంకటేశ్వరరావు, రత్నకుమారి, గంగరాజు, అన్నం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



వెంకటపతిరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం